సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



జగనన్న సురక్షతో భరోసా

'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మల్లికార్జున సూచించారు. 8లో



నిరాశ్రయుల నేస్తం ఏయూటీడీ

అనాథలు, నిరాశ్రయులకు అండగా నిలిచి ఆశ్రయం ఇప్పిస్తోంది ఏయూటీడీ సంస్థ. కంటికి రెప్పలా కాపాడుతోంది. 8లో



ఏయూలో ప్రవేశాల సందడి

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సుల్లో ప్రవేశాల సందడి ఆరంభమైంది. 8లో

పీఎస్‌టీ

ఇది జీఎస్‌టీకి అదనం

కార్గో షిప్స్ నుంచి పోర్టు స్పెషల్ ట్యాక్స్ వసూలు



పోర్టులో కార్గో కంటైనర్స్ హ్యాండ్లింగ్

సర్.. కంటైనర్ కార్గో వచ్చింది.. అని చెబితే చాలు.. మొత్తం లోడ్ ఎంత అని ప్రశ్న వస్తుంది. 100 కంటైనర్లు సర్.. అవునా.. ఓకే.. మొత్తం రూ.2 లక్షలు. చెప్పేసెయ్.. త్వరగా తీసుకురమ్మని చెప్పు. అలాగే సర్...

సర్.. బెర్త్ త్వరగా కావాలంట.. ఏం చెప్పమంటారు.? అవునా..? ఎంత సేపటిలో కావాలి.?? తెలుసుకదా.. మన టైమింగ్స్ గురించి.. గంటలో అయితే రూ.లక్ష కట్టియ్యమను. బెర్త్ కన్‌ఫర్మ్ చేసుకోమను..

ఇవి.. విశాఖ పోర్టు అథారిటీలో(వీపీఏ) నిత్యకృత్యంగా మారిన సంభాషణలు.

పోర్టుకు షిప్ వస్తే చాలు.. పీఎస్‌టీ కట్టాల్సిందే. అంటే.. పోర్టు స్పెషల్ ట్యాక్స్. ఇది జీఎస్‌టీకి అదనం. ఓ అధికారి.. తన జేబులోకి వచ్చేలా విధిస్తున్న ట్యాక్స్ ఇది.

సాక్షి, విశాఖపట్నం : విశాఖ పోర్టు 100 హెక్టార్లలో ఇన్నర్ హార్బర్, 200 హెక్టార్లలో అవుటర్ హార్బర్ విస్తరించి ఉన్నాయి. ఇందులో ఇన్నర్ హార్బర్‌లో 22 బెర్తులు, అవుటర్ హార్బర్‌లో 8 బెర్తులు కలిపి మొత్తం 30 బెర్తులు ఉన్నాయి. వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి ప్రతి రోజూ పోర్టుకు సగటున 10 కార్గో షిప్స్ హ్యాండ్లింగ్ జరుగుతుంటాయి. ఇక్కడ ఎగుమతి, దిగుమతులకు సంబంధించిన హ్యాండ్లింగ్స్‌ని నిర్వర్తిస్తుంటారు. పోర్టులోని ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో హ్యాండ్లింగ్ వ్యవహారాలు జరుగుతుంటాయి. కస్టమ్స్, ఇతర విభాగాలు సరకు ఎగుమతి దిగుమతులకు సంబంధించి సర్టిఫైడ్ చేస్తుంటాయి. ఇక్కడే అసలు కథ మొదలవుతుంటుంది. ట్రాఫిక్ విభాగంలోని ఓ అధికారి స్పెషల్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి పోర్టులో పాతుకుపోయిన సదరు ఉద్యోగి పోర్టు ఉన్నతాధికారుల్ని సైతం ఏమార్చుతున్నారు.

- ఒక్కో కంటైనర్ షిప్ నుంచి రూ.2 లక్షల వరకూ వసూళ్లు
- ముందుగా చెల్లించిన వారికే బెర్త్ కన్‌ఫర్మ్ చేస్తున్న వైనం
- అత్యవసరంగా బెర్త్ కావాలంటే మరో ట్యాక్స్ అదనం
- చక్రం తిప్పుతున్న విశాఖ పోర్టు ట్రాఫిక్ విభాగంలోని ఓ అధికారి

జేబు ట్యాక్స్ చెల్లించకుంటే..

సరుకుతో షిప్ వస్తే చాలు.. సదరు ట్రాఫిక్ అధికారి బేరసారాలు మొదలవుతాయి. వచ్చిన సరకు ఏంటి.? ఎంత బరువు ఉంది.? దాన్ని బట్టి.. తనకు చెల్లించాల్సిన స్పెషల్ ట్యాక్స్ విధిస్తారు. దానిని స్టివడోర్స్ చెల్లిస్తే సరేసరి.. లేదంటే.. ఆ షిప్‌లోనే సరుకు ఉండిపోతుంది. ఆయన రూ.2 నుంచి రూ.5 లక్షల వరకూ తన జేబు ట్యాక్స్ విధిస్తుంటారు. స్టివడోర్స్ బేరసారాలాడి తమకు ఓకే అనుకున్న మొత్తం చెల్లించి.. హ్యాండ్లింగ్ పనులకు దిగుతారు. దీనిపై గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో.. చేసేది లేక.. సదరు ట్రాఫిక్ అధికారికి స్పెషల్ ట్యాక్స్ చెల్లించుకుంటూ తమ పనులను కానిచ్చేస్తున్నారు. ఇంకో విషయమేంటంటే.. షిప్ పోర్టుకు చేరిన తర్వాత.. బెర్త్ కన్ఫర్మ్ చేయాల్సింది కూడా ట్రాఫిక్ విభాగమే.. ఆ బెర్త్ కన్ఫర్మేషన్‌కు కూడా సదరు అధికారికి కప్పం కట్టాల్సిందే. ఇలా అందినకాడికి దోచుకుంటూ.. పోర్టులో అడ్డూ అదుపూ లేకుండా ట్రాఫిక్ విభాగాన్ని సదరు అధికారి శాసిస్తున్నారు. కొందరు ఉన్నతాధికారులకు ఈయన చేస్తున్న అవినీతి గురించి తెలిసినా.. పట్టించుకోవడం లేదంటూ తోటి ఉద్యోగులు సైతం వాపోతుండటం కొసమెరుపు.

ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు

జేసీ విశ్వనాథన్ ఆదేశం

దొండపర్తి: జిల్లాలో ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ప్యాడి ప్రొక్యూర్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం ఉత్పత్తిని అంచనా వేసి అందుకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ-క్రాప్ బుకింగ్, ఈ-కేవైసీ తప్పని సరిగా చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ఆర్బీకేలకు అనుసంధానం చేసి, ప్రక్రియ సజావుగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. క్లస్టర్ ఆర్బీకేలలో టెక్నికల్ అసిస్టెంట్లు జిల్లాలో గన్ని బ్యాగులు ఏ మేరకు అవసరం అవుతాయో గుర్తించి, మిల్లర్ల వద్ద నుంచి సేకరించి నిల్వ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

ధాన్యం రవాణాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత వాహనాలకు జీపీఎస్ అనుసంధానం చేయాలని డీటీసీకి చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ ఐ.రాజేశ్వరి, జిల్లా రవాణా అథారిటీ అధికారి ఎం.బుచ్చిరాజు, జిల్లా సహకార అధికారిని ప్రవీణ, లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కమిషనర్ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్(టెక్నికల్) ఎం.సృజన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రగతి నివేదికలను 12లోగా అందించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

దొండపర్తి : సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా గ్రామ పంచాయతీల్లో జరిగే అభివృద్ధిని అంచనా వేసేందుకు 23 రకాల అభివృద్ధి సూచికలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా సూచికలకు అనుగుణంగా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రగతి నివేదికలను ఈ నెల 12వ తేదీలోగా నిర్ణీత ప్రొఫార్మాలో అందించాలని అధికారులను ఆదేశించారు. 2023 మార్చి, 31 నుంచి ఇప్పటివరకు ఉన్న డేటాను పరిగణనలోకి తీసుకొని సంబంధిత కచ్చితమైన వివరాలను అందించాలని సూచించారు. తొమ్మిది



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

రకాల అంశాల్లో ప్రగతి కనబరిచిన పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని వివరించారు. పంచాయతీ అభివృద్ధి సూచికలకు అనుగుణంగా స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్, జిల్లా పరిషత్, జిల్లా పంచాయతీ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సీఎం నగర పర్యటనకు ఏర్పాట్లు



ఇన్ఫోసిస్ అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన ఏర్పాట్లను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సోమవారం పరిశీలించారు. ఈ నెల 16న ముఖ్యమంత్రి ఇన్ఫోసిస్ ఐటీ కంపెనీని ప్రారంభించనున్న దృష్ట్యా రుషికొండ ఐటీ సెజ్ ప్రాంతాల్లో ఇన్ఫోసిస్, జీవీఎంసీ అధికారులతో పర్యటించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ఫోసిస్ కార్యాలయంలో ముఖ్యమంత్రి ప్రారంభం చేసే ప్రాంగణం, స్టేజీతో పాటు హెలిప్యాడ్ తదితర ప్రాంతాలను పరిశీలించి తగు సూచనలు చేసినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, విద్యుత్, రోడ్ల పరిశుభ్రత, రోడ్డు ప్యాచ్‌వర్క్స్, గ్రీనరీ తదితర పనులు త్వరితగతిన చేపట్టాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఆయనతో అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజనీరు రవికృష్ణరాజు, పట్టణ ప్రణాళికాధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, పర్యవేక్షక ఇంజనీర్ శ్యాంసన్‌రాజు, ఏఎంఓహెచ్ డాక్టర్ ఎస్.కిశోర్, కార్యనిర్వాహక ఇంజనీర్ శాంతిరాజు, డీఈ వంశీ ఉన్నారు.

'ఆడుదాం-ఆంధ్ర' కిట్ల పరిశీలన



కిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

దొండపర్తి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వచ్చే నెలలో నిర్వహించనున్న 'ఆడుదాం-ఆంధ్ర' కార్యక్రమం నేపథ్యంలో జిల్లాకు వచ్చిన స్పోర్ట్స్ కిట్ల శాంపిల్స్‌ను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సోమవారం తన ఛాంబర్‌లో పరిశీలించారు. జిల్లాలోని అన్ని సచివాలయాలకు ఈ కిట్లు పంపిస్తున్నట్లు సెట్విస్ సీఈఓ ఎస్.వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు వివరించారు. ఈ కిట్లు సక్రమంగా పంపిణీ అయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీఓ జూన్ గ్యాలియెట్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డివిజనల్ పీఆర్వోగా నారాయణరావు



దొండపర్తి: సమాచార పౌర సంబంధాల శాఖ విశాఖ నూతన డివిజనల్ పీఆర్వో డి.నారాయణరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు విజయనగరంలో ఏపీఆర్వోగా పనిచేశారు. పదోన్నతిపై విశాఖ డీపీఆర్వోగా నియమితులయ్యారు. ఆయన సోమవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నారాయణరావును సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ వి.మణిరామ్ అభినందించారు.

నేడు పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశం

విశాఖ విద్య: జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలల్లో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని డీఈవో ఎల్. చంద్రకళ తెలిపారు. ఫార్మటివ్-2 పరీక్ష పేపర్ల మూల్యాంకనం పూర్తి చేసి, విద్యార్థులకు అందజేయాలన్నారు. పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులపై వారి తల్లిదండ్రులతో సమీక్షించాలన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులకు మేలు చేసేలా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇటువంటి ఏర్పాట్లు చేశామన్నారు. ఫార్మటివ్ -2 పరీక్షల్లో విద్యార్థుల సాధించిన మార్కులను వెంటనే విద్యాశాఖ వెబ్‌సైట్‌లో కూడా నమోదు చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులంతా పాఠశాలల్లో నిర్వహించే సమావేశాలకు హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు శ్రద్ధతీసుకోవాలన్నారు.

బేస్‌బాల్, తైక్వాండో పోటీలు, ఎంపికలు వాయిదా

అగనంపూడి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి విశాఖ సారథ్యంలో ఈనెల 10వ తేదీన నిర్వహించాల్సిన బేస్‌బాల్, తైక్వాండో పోటీలు, ఎంపికలు దసరా సెలవుల అనంతరం నిర్వహించనున్నట్లు అనకాపల్లి, విశాఖ జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు ఎం.వి.నాగేశ్వరరావు, టి.నాగేశ్వరరావు తెలిపారు. అనివార్య కారణాల వల్ల వాయిదా పడ్డాయని, మూడు జిల్లాల్లోని వ్యాయామ ఉపాధ్యాయులు గమనించాలని కోరారు.

రూ.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

బీచ్‌రోడ్డు: హెచ్‌బీ కాలనీకి చెందిన టి.లీలావతి కుమారుడుకి రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. దీంతో లీలావతి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. సీఎం కార్యాలయ అధికారులు స్పందించి రూ.10 లక్షలు మంజూరు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో చెక్కును లీలావతికి కలెక్టర్ మల్లికార్జున అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండడమే ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు.



లీలావతికి రూ.10 లక్షల చెక్కును అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సంజీవిని నిధి నుంచి..

తన తమ్ముడు మృతి చెందిన కారణంగా కుటుంబ పోషణ భారంగా ఉండడంతో పీఎంపాలెంకు చెందిన వై.లక్ష్మి ఆర్థిక సాయం కోసం కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. దీంతో సంజీవిని నిధి నుంచి సోమవారం కలెక్టర్ రూ.15 వేల చెక్కును లక్ష్మికి అందజేశారు. అలాగే కొమ్మాదికి చెందిన జె.బాబీరాణి గుండెజబ్బుతో బాధపడుతుండగా ఆమెకు కూడా కలెక్టర్ రూ.15 వేల చెక్కును అందజేశారు.

ఫుడ్‌పాయిజన్‌తో 14 మందికి అస్వస్థత

- గాజువాకలోని మండి క్రూడ్స్ రెస్టారెంట్‌లో ఘటన
- కేజీహెచ్‌లో చికిత్స అనంతరం డిశ్చార్జ్

అక్కిరెడ్డిపాలెం/దాబాగార్డెన్స్: ఫుడ్‌పాయిజన్‌తో 14 మంది యువకులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని 108లో కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందించడంతో ముప్పు తప్పింది. ఈ ఘటన గాజువాకలోని మండి క్రూడ్స్ రెస్టారెంట్‌లో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గాజువాక ములగాడ ఎస్సీ కాలనీకి చెందిన 14 మంది యువకులు ఆదివారం రాత్రి వినాయక అనుపోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం గాజువాకలోని మండి క్రూడ్స్ రెస్టారెంట్‌లో బిర్యానీతో పాటు వింగ్స్ మండి, డ్రమ్స్ స్టిక్స్, డ్రింక్, మైనస్(క్రీమ్) తిన్నారు. తర్వాత వారంతా ఇళ్లకు చేరుకున్నారు. సోమవారం ఉదయం వారంతా కడుపు నొప్పి, తలనొప్పి, విరేచనాలు, వాంతులతో అస్వస్థతకు గురవగా కుటుంబ సభ్యులు 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందిన అనంతరం 11 మంది వెంటనే.. మరో ముగ్గురు కొంతసేపటికి తర్వాత డిశ్చార్జ్ అయ్యారు. బాధితుడు రాకేష్ రెస్టారెంట్ యజమానిపై రవీంద్రనాథ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు సేకరించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు అలర్ట్ అయ్యారు. ఫుడ్ శాంపిల్స్ సేకరించారు.



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులు

ఆటల్లో అదరగొట్టేలా..

- వ్యాయామ విద్యకు ప్రత్యేక కార్యాచరణ
- జిల్లాలో మూడు చోట్ల స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాలు
- నెలలో ఒక రోజు ప్రత్యేక సమావేశం

విశాఖ విద్య: విద్యార్థులు చదువులతో పాటు, క్రీడల్లోనూ రాణించేలా ప్రభుత్వ పాఠశాలల్లో పటిష్టమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. వార్షిక విద్యా క్యాలెండర్‌లో రెగ్యులర్ సబ్జెక్టులతో పాటు, రోజూ వ్యాయామ విద్యకు సైతం ప్రాధాన్యత ఇచ్చేలా పీరియడ్‌ల రూపకల్పన చేశారు. దీనిని మరింత పటిష్టంగా అమలు చేసే క్రమంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల నిర్వహణకు విద్యాశాఖాధికారులు షెడ్యూల్ సిద్ధం చేశారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాలు

వ్యాయామ విద్య అమల్లో ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు పాత్ర ఎంతో కీలకం. అందుకనే జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న వ్యాయాయ ఉపాధ్యాయులందరికీ వృత్తి నైపుణ్యత పెంచుకునేలా ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా నెలలో ఒక రోజు స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. విశాఖ ఈస్ట్, విశాఖ సౌత్, విశాఖ నార్త్ నియోజకవర్గాల పరిధిలోని పాఠశాలలకు క్వీన్ మేరీ హైస్కూల్స్, భీమిలి నియోజకవర్గం పరిధిలోని వారికి అడవివరం జెడ్పీ హైస్కూల్, గాజువాక, పెందుర్తి, విశాఖ వెస్ట్ నియోజకవర్గాల వారికి పెందుర్తి జెడ్పీ హైస్కూల్ వేదికగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహిస్తున్నారు. కాంప్లెక్స్ కో-ఆర్డినేటర్, రిసోర్స్ పర్సన్ల పర్యవేక్షణలో వ్యాయామ ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్య అంశాలపై తర్ఫీదు పొందుతారు.

పాఠశాలలకు స్పోర్ట్స్ మెటీరియల్

స్కూళ్లలో వ్యాయామ విద్య అమల్లో భాగంగా విద్యార్థులు ఆడుకునేందుకు క్రీడా సామగ్రిని ఇటీవలనే సరఫరా చేశారు. ప్రైమరీ స్కూళ్లకు తొమ్మిది రకాలతో కూడిన స్పోర్ట్స్ కిట్, అప్పర్ ప్రైమరీ స్కూళ్లకు 14 రకాల ఆటవస్తువులు, హైస్కూళ్లకు 17 రకాలతో కూడిన ఆట వస్తువుల కిట్‌ను సరఫరా చేశారు.



వ్యాయామ విద్యపై మెలకువలు నేర్చుకుంటున్న ఉపాధ్యాయులు

క్రీడలకు ఇన్నాళ్లకు గుర్తింపు



రోజూ వ్యాయామ బోధన సాగేలా వార్షిక క్యాలెండర్‌లో రూపొందించడం మంచి పరిణామం. క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రభుత్వం తగిన అవకాశాలు కల్పిస్తోంది. ప్రత్యేకంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తుండడం వల్ల మరింత మేలు జరుగుతుంది.

– టి.నాగేశ్వరరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి, విశాఖ జిల్లా

క్రీడాకారులకు మంచి అవకాశాలు



ప్రభుత్వ స్కూళ్లల్లో చదువుకునే విద్యార్థుల్లో చాలా మంది మంచి క్రీడాకారులు ఉన్నారు. వీరికి తోడ్పాటు ఇస్తే, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా రాణిస్తారు. వ్యాయామ విద్యపై శ్రద్ధ చూపేలా ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తోంది. క్రీడలపై ఆసక్తి ఉన్న వారికి భవిష్యత్‌లో మంచి అవకాశాలు దక్కుతాయి.

– బి.రామచంద్రనాయుడు, పీడీ, అడవివరం జెడ్పీ హైస్కూల్

సమావేశాలతో ఎంతో మేలు



ప్రత్యేకంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాలతో వ్యాయాయ విద్యకు గుర్తింపు వచ్చింది. జిల్లాలోని ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులంతా ఒక చేట చేరి సమీక్షించుకోవటం ద్వారా వృత్తి నైపుణ్యత పెంచుకునే అవకాశం ఉంటుంది. క్రీడల్లో రాణించేలా విద్యార్థులను ఎలా తీర్చిదిద్దాలనే అంశాలను తెలుసుకోవచ్చు.

– కె.నారాయణమ్మ, ఫిజికల్ డైరెక్టర్, జెడ్పీ హైస్కూల్ పద్మనాభం

గతంలో ఇలా జరగలేదు



వ్యాయామ విద్యపై గతంలో ఎప్పుడు ఇలాంటి కసరత్తు జరగలేదు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లతో వ్యాయాయ ఉపాధ్యాయులంతా భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకునేందుకు వీలు కలుగుతుంది. దీని వల్ల మెరుగైన ఫలితాలు వస్తాయి. వ్యాయామ విద్యతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది.

– కోట సతీష్, పీడీ, గవర్నమెంట్ హైస్కూల్, భీమునిపట్నం

ఓపీ.. 'అభా'తో హ్యాపీ

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆన్‌లైన్ ఓపీ
- అభా యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు
- క్యూల్లో వేచి ఉండక్కర్లేదు.. సమయం ఆదా.!

మహారాణిపేట: ప్రస్తుత డిజిటల్ యుగంలో అగ్గిపెట్టె నుంచి ఆడి కారు కొనుగోలు వరకూ ఆర్థిక లావాదేవీలు మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లోనే జరిగిపోతున్నాయి. చిన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అవతలి వ్యక్తి ఖాతాలోకి డబ్బులు పంపుతున్నారు. ఇదే తరహాలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా అవుట్ పేషెంట్(ఓపీ) రిజిస్ట్రేషన్ పూర్తి చేసి డాక్టర్ అపాయింట్‌మెంట్‌కు టోకెన్ పొందే వెసులుబాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులోకి వచ్చింది. డిజిటలైజేషన్‌లో భాగంగా అభా(ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) యాప్‌లో రోగి వివరాలను నమోదు చేసి వైద్యం పొందే సేవలు ఇటీవల కేజీహెచ్, ఈఎన్‌టీ, చాతీ తదితర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రారంభమయ్యాయి. ఈ విధానంపై ఆస్పత్రిలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటుతో పాటు క్యూఆర్ కోడ్ పోస్టర్లు, ఓపీ రిజిస్ట్రేషన్ ఎలా చేసుకోవాలో అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలను అమర్చారు.

ఏమిటి లాభం?

దేశవ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో సేవలు పొందే రోగుల వివరాలను 'నేషనల్ హెల్త్ రికార్డ్స్'లో పొందుపరిచేందుకు ఆన్‌లైన్ అవుట్ పేషంట్(ఓపీ) విధానాన్ని విస్తరిస్తున్నారు. క్యూలో వేచి ఉండే సమయాన్ని ఈ విధానం ద్వారా ఆదా చేసుకోవచ్చు. సాధారణంగా ఎవరైనా వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వెళితే తొలుత ఓపీ కౌంటర్‌లో వివరాలను నమోదు చేసుకోవాలి. రోగి పేరు, చిరునామా, ఫోన్ నంబర్, ఇతర వ్యక్తిగత వివరాలను వెల్లడించాలి. అనంతరం సంబంధిత విభాగానికి రోగికి ఓపీ టికెట్ ఇస్తారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యేందుకు కనీసం 5 నుంచి 10 నిమిషాలు పడుతుంది. పెద్దాస్పత్రుల్లో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోగులు గంటల తరబడి క్యూలో నిల్చొని పడిగాపులు పడాల్సి వస్తుంది. అదే క్యూఆర్ కోడ్ ద్వారా ఓపీ రిజిస్ట్రేషన్ చేసుకుంటే నేరుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌కు వెళ్లి టోకెన్ తీసుకుని డాక్టర్‌ను సంప్రదించవచ్చు. క్యూలో నిరీక్షించే అగచాట్లు తప్పుతాయి.



కేజీహెచ్‌లో ఓపీ కౌంటర్లు

కేజీహెచ్‌లో ప్రస్తుత పరిస్థితి ఇదీ..

ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్‌లో ఓపీ చీటీల జారీకి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. కేజీహెచ్‌లో సోమవారం, బుధవారం, గురువారాల్లో రోగుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. పెరుగుతున్న రోగులకు ఓపీ చీటీల జారీ కోసం కౌంటర్ల సంఖ్య పెంచారు. మొత్తం ఏడు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని కౌంటర్లు పనిచేస్తాయి. ఇందులో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా కౌంటర్లు, సీనియర్ సిటిజెన్లు, దివ్యాంగులకు ఓ కౌంటర్, కేజీహెచ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది, జర్నలిస్టులకు ఓ కౌంటర్, ఇన్ పేషంట్ కేసు షీట్లకు ఓ కౌంటర్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం నుంచి రెండు కౌంటర్లు, రాత్రి సమయంలో రెండు కౌంటర్లు పని చేస్తున్నాయి. ఈ కౌంటర్లలో ప్రతి రోజూ 1,400 నుంచి 1,500 ఓపీ చీటీలు, 200 నుంచి 300 వరకు ఇన్ పేషంట్ల కోసం కేసు షీట్లను జారీ చేస్తున్నారు. ఇక్కడ ఆన్‌లైన్ ఓపీ చీటీల జారీలో చిన్నపాటి సమస్యలు తలెత్తుతున్నాయి. నెట్‌వర్క్ సమస్య ఉంది. ఈ విధానంపై అవగాహన లేని వారు అక్కడే ఉన్న వైద్య సిబ్బందిని సంప్రదిస్తే.. వారు తగిన సూచనలిస్తారు. అభా యాప్ లేకపోయినా పాత పద్ధతిలో ఓపీ చీటీలు పొందవచ్చు.



ఓపీ విభాగం లోపల కౌంటర్లు

ఇదీ నమోదు విధానం

- స్మార్ట్ ఫోన్‌లోని ప్లేస్టోర్‌కు వెళ్లి.. ఏబీహెచ్‌ఏ (అభా) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ఆయుష్మాన్ డిజిటల్ హెల్త్ అకౌంట్(అభా) 14 అంకెల గుర్తింపు/ఫోన్ నంబర్/మెయిల్ ఐడీ ద్వారా యాప్‌లో రిజిస్టర్ అవ్వాలి.
- యాప్‌లోకి లాగిన్ అయిన వెంటనే అభా వివరాలు ప్రత్యక్షం అవుతాయి. వీటిని ఆస్పత్రితో షేర్ చేసే ఆప్షన్ కనిపిస్తుంది. షేర్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే టోకెన్ నంబర్ వస్తుంది. ఈ టోకెన్ 30 నిమిషాల పాటు వ్యాలిడిటీలో ఉంటుంది.
- టోకెన్ నంబర్ వచ్చాక ఆస్పత్రిలో కౌంటర్‌కు వెళ్లి అభా గుర్తింపు నంబర్, ఫోన్ నెంబర్ తెలియజేసి ఏ స్పెషాలిటీలో ఓపీ అవసరమో చెబితే వైద్య సిబ్బంది చీటీ ఇస్తారు. దీన్ని తీసుకుని నేరుగా డాక్టర్‌ను సంప్రదించవచ్చు. సాంకేతిక సమస్య లేకపోతే ఇదంతా రెండు నిమిషాల్లోనే అయిపోతుంది. ఒక వేళ నెట్‌వర్క్ సమస్య ఉంటే కొంత టైమ్ పడుతుంది.
- ఆస్పత్రికి వెళ్లే ముందే ఇంటి వద్ద అభా యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే.. ఓపీ కౌంటర్ వద్ద పని సులువవుతుంది. ఒకసారి యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు.. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు పొందవచ్చు.
- ఈ విధానంపై అవగాహన కల్పించేందుకు ఓపీ కౌంటర్ల వద్ద వైద్య సిబ్బంది ఉంటారు.
- ప్రస్తుతం పాత పద్ధతిలో ఓపీ చీటీలు ఇస్తూనే.. సమాంతరంగా అభా విధానాన్ని అమలు చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్ లేని వారు సిబ్బందిని సంప్రదిస్తే ఓపీ చీటీ ఇస్తున్నారు.

'అభా'తో రోగికి సమయం ఆదా



అభా యాప్ వల్ల రోగికి సమయం ఆదా అవుతుంది. ఒకసారి డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు.. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు పొందవచ్చు. ఈ యాప్‌పై రోగులకు అవగాహన కల్పించేందుకు సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌లో రోగి పేరు నమోదు వల్ల రూ.5 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. ఆశ, ఏఎన్ఎంలను సంప్రదించినా అభాలో పేర్లు నమోదు చేస్తారు.

– డాక్టర్ పి.అశోక్ కుమార్, సూపరింటెండెంట్, కేజీహెచ్

బండారు బహిరంగ క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న మంగరాజు

దాబాగార్డెన్స్: మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తి బహిరంగ క్షమాపణ చెప్పాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. దాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్లో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉండి, 6 లక్షల కోట్లు అవినీతికి పాల్పడిన విషయమై మంత్రి రోజా మాట్లాడారే తప్పా స్వార్థ రాజకీయాల కోసం కాదన్నారు. చంద్రబాబు జైల్లో, లోకేష్ ఢిల్లీలో ఉండడం వల్ల పవన్‌కు పగ్గాలు అప్పగించడానికి టీడీపీ సిద్ధంగా ఉందన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 సీట్లు గెలుచుకొని చరిత్ర సృష్టిస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆనంద్, సునీల్‌బాబు, సందీప్, రోహిత్ పాల్గొన్నారు.

ఫిజిక్స్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: జిల్లాలోని మల్కాపురం హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియెట్ భౌతిక శాస్త్రం బోధించుటకు ఆసక్తి గల అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ పరిధిలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సబ్జెక్టు టీచర్లు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటలలోగా అన్ని రకాల ధృవీకరణ పత్రాలను డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

సోలార్ విద్యుత్‌తో పర్యావరణ పరిరక్షణ



మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ ఇంధన శాఖ మాజీ ప్రధాన కార్యదర్శి ఈఏఎస్ శర్మ

సీతంపేట: సోలార్ విద్యుత్ వాడకం వలన కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని కేంద్ర ప్రభుత్వ ఇంధన శాఖ మాజీ ప్రధాన కార్యదర్శి ఈఏఎస్ శర్మ అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో డీసెంట్రలైజ్ సోలార్ పవర్ సిస్టం (స్థిరమైన గ్రామాల సాధికారత) అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుత్ చాలా చౌకని, కాలుష్య రహితమని తెలిపారు. సోలార్ సిస్టంను కార్పొరేట్ కంపెనీలకు కాకుండా స్వతంత్రంగా గృహాలకు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పైగా సోలార్ సిస్టం వాడకాలను ప్రారంభిస్తే కరెంట్ అవసరం ఉండదని తెలిపారు. రాష్ట్రంలో అధిక భాగం విద్యుత్‌ను థర్మల్ పవర్ స్టేషన్ల ద్వారా ఉత్పత్తి చేసుకుంటున్నామని గుర్తుచేశారు. థర్మల్ పవర్ ద్వారా ఒక మెగా వాట్ సామర్థ్యానికి రూ.8 నుంచి 10 కోట్లు పెట్టుబడి అవుతుందని, పవర్ స్టేషన్ల ద్వారా పర్యావరణం దెబ్బతింటోందన్నారు. రానున్న పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం సోలార్ ఎనర్జీ కోసం20 లక్షల కోట్లు ఖర్చు చెయ్యడానికి సిద్ధంగా ఉందన్నారు. కాబట్టి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెచ్చించే నిధుల నుంచి రెన్యువల్ ఎనర్జీ ప్లాంట్లు గ్రామీణ స్థాయిలో నెలకొల్పేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలు తయారు చెయ్యాలని శర్మ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మానవ హక్కులసంఘం నాయకులు కాంద్రేగుల వెంకటరమణ, కిసాన్ సర్వీస్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు అక్కినేని భవాని ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

గోపాలపట్నం: మర్రిపాలెం రాణాప్రతాప్‌నగర్‌లో వ్యభిచార గృహంపై ఎయిర్‌పోర్టు పోలీసులు సోమవారం సాయంత్రం దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు విటులు, నిర్వాహకురాలిని అదుపులోకి తీసుకున్నారు.కొన్నాళ్లుగా ఇక్కడ వ్యభిచారం సాగుతోంది. పోలీసులకు వచ్చిన పక్కా సమాచారంతో దాడి చేశారు. ఎయిర్‌పోర్టు సీఐ బీఎండీ ప్రసాద్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

నిరాశ్రయుల నేస్తం ఏయూటీడీ

- అభాగ్యుల బాగోగులే లక్ష్యంగా చర్యలు
- దేశవ్యాప్తంగా ఎన్నో ఇళ్లల్లో వెలుగులు నింపిన సంస్థ

అల్లిపురం: అనాథలు, నిరాశ్రయులు, మానసిక వికలాంగులు, వృద్ధులకు అండగా నిలిచి ఆశ్రయం ఇప్పిస్తోంది ఏయూటీడీ సంస్థ. ఉండటానికి ఇళ్లు, కట్టుకోవడానికి సరైన దుస్తులు లేక రోడ్లపై తిరిగే వారికోసం జీవీఎంసీ సహాయంతో ఏయూటీడీ సంస్థ నగరంలో పలుచోట్ల వసతి గృహాలు నిర్వహిస్తోంది. వీటిలో ఆహారం, చికిత్స అందిస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా వేలాది మందికి ఆశ్రయం కల్పించడంతోపాటు మానసిక వికలాంగులకు ప్రత్యేకంగా చికిత్స అందించి, పూణేకు చెందిన శ్రద్ధా ఫౌండేషన్ సాయంతో వారిని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చుతోంది. వారి మోముల్లో ఆనందాన్ని నింపుతోంది.

మానసిక వికలాంగులకు మనోధైర్యం

దేశంలోని పలు ప్రాంతాల నుంచి మానసిక వికలాంగులు రైళ్లలో వచ్చి నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో సంచరిస్తుంటారు. రోడ్డు పక్కన దీనస్థితిలో మలమూత్రాలతో తడిసిపోయి, చూసిన వారికి రోత పుట్టించేలా తిరుగాడుతుంటారు. అలాంటి వారి సమాచారాన్ని కొంత మంది జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి అందిస్తుంటారు. సమాచారం తెలుసుకున్న సిబ్బంది ఆ అభాగ్యుల వద్దకు చేరుకుని అక్కడికక్కడ సపర్యలు చేసి, దుస్తులు మార్చి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుంటారు. ఈ క్రమంలో గతంలో సుప్రీంకోర్టు న్యాయవాది ఒకరిని బీచ్‌రోడ్డులో సంస్థ ప్రతినిధులు సంరక్షించి చికిత్స అందజేశారు. ఆమె ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆమెను తీసుకెళ్లారు. పూణేకు చెందిన శ్రద్ధ ఫౌండేషన్‌కు దేశ వ్యాప్తంగా ఉన్న నెట్‌వర్కు సాయంతో వివిధ రాష్ట్రాలకు చెందిన వారిని వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చి ఆయా కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది.

అడ్డంకిగా మానసిక ఆస్పత్రి నిబంధనలు

గతంలో మానసిక చికిత్సాలయం సూపరింటెండెంట్, సిబ్బంది సహకారంతో మానసిక వికలాంగులకు చికిత్స అందజేసేవారు. వారికి సరైన చికిత్స అందజేయడంతో కోలుకున్న తర్వాత ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహాలు టీఎస్ఆర్ కాంప్లెక్స్, భీమ్‌నగర్‌లో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా ఆశ్రయం కల్పించేవారు. వారి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించేవారు. ప్రస్తుతం ఉన్న సూపరింటెండెంట్ నేరుగా మానసిక వికలాంగులను ఆస్పత్రిలో చేర్చుకోమని, రివ్యూ బోర్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సిఫార్సు చేశామని, బోర్డులో సభ్యులు సిఫార్సు చేస్తేనే తీసుకుంటామని చెబుతున్నారని ఏయుటీడీ ప్రతినిధి ప్రగడ వాసు తెలిపారు. పాత పద్ధతిలోనే రోగులను చేర్చుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



టీఎస్ఆర్ కాంప్లెక్స్ పురుషుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయులు



భీమ్‌నగర్‌లో గల జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం



టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో జీవీఎంసీ ఏయూటీడీ మహిళ, పురుషుల వసతి గృహం



కోలుకున్న తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించిన జ్యోత్స్న

రెండేళ్లుగా ఆశ్రయం కల్పించారు



నాది శ్రీకాకుళం. నాకు నా అన్నవారు ఎవరూ లేరు. ప్రమాదంలో కుడికాలు పోగొట్టుకున్నా. గత రెండు సంవత్సరాలుగా జీవీఎంసీ, ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. అన్ని రకాల వసతులు అందుతున్నాయి.

– జి.రామారావు, టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఆశ్రయం పొందిన వ్యక్తి

కుటుంబాన్ని కోల్పోయా



నేను మానసిక వ్యాధితో కుటుంబాన్ని కోల్పోయాను. దిక్కు తోచకుండా కాకినాడ నుంచి విశాఖపట్నం చేరుకున్నా. నన్ను ఏయుటీడీ సిబ్బంది అక్కున చేర్చుకుని చికిత్స అందజేశారు. ఇప్పుడు నా ఆరోగ్యం బాగుపడింది.

– మంగ, కాకినాడ, టీఎస్ఆర్ షెల్టర్

215 మంది రికవరీ



2013 నుంచి ఇప్పటి వరకు 215 మందిని రికవరీ చేశాం. వారిలో 49 మంది మహిళలు, 140 మంది పురుషులను పూణేలోని శ్రద్ధ ఫౌండేషన్ ద్వారా సొంత కుటుంబాల చెంతకు చేర్చగలిగాం. మానసిక ఆస్పత్రిలో రోగులను చేర్చుకునే విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి.

– ప్రగడ వాసు, ఏయుటీడీ కార్యదర్శి

వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం

- కలెక్టర్ మల్లికార్జున
- 'జగనన్నకు చెబుదాం'కు 282 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

దొండపర్తి: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి వచ్చిన వినతుల పరిష్కారంపై దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమానికి 282 వినతులు వచ్చాయి. ఇందులో రెవెన్యూకి 118, జీవీఎంసీకి 79, పోలీస్‌కి 12, ఇతర శాఖలకు సంబంధించి 73 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. జిల్లా స్థాయి కార్యక్రమం మాదిరిగానే డివిజన్, మండల స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి అంతే ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. అన్ని స్థాయిల్లో జరిగే కార్యక్రమాలకు జిల్లా స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలని స్పష్టం చేశారు.

ప్రణాళికాయుతంగా ఆరోగ్య సురక్ష శిబిరాలు

ప్రజల ఆరోగ్య పరమైన సమస్యలను గుర్తించి క్షేత్ర స్థాయిలో వైద్య చికిత్సలు అందించేందుకు ఉద్దేశించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రణాళికాయుతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. వీటి ద్వారా కలిగే ప్రయోజనాలు సంపూర్ణంగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి సురక్ష శిబిరాల నిర్వహణలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

సచివాలయాలను సందర్శించాలి

అధికారులు వారి పరిధిలో ఉండే సచివాలయాలను తరచూ సందర్శించాలని, సచివాలయ ఉద్యోగులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలతో సఖ్యతగా మెలిగేలా, వినయంగా వ్యవహరించేలా చూడాలని, అవసరమైతే సచివాలయ ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. సచివాలయాల్లో ఏమైనా సమస్యలు ఉన్నా, సాంకేతిక పరికరాలు కావాలన్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ, పోలీస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే చర్యలు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- 'జగనన్నకు చెబుదాం'లో 106 అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్ : ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ హెచ్చరించారు. 3 రోజుల్లో అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలని, అలా కాని పక్షంలో తన దృష్టికి తీసుకురావాలన్నారు. అర్జీదారులు ఒకే సమస్యపై పదేపదే అర్జీలు సమర్పించుకునేలా అధికారులు ప్రవర్తించకూడదన్నారు. సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమస్యలు పరిష్కారం కావడం లేదని తన దృష్టికి అర్జీదారులు తీసుకువచ్చారన్నారు. మరోసారి ఇలా రిపీట్ అయితే అధికారులపై చర్యలు తప్పవన్నారు. సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 106 అర్జీలు స్వీకరించామన్నారు. ఈ సందర్భంగా బాధితులు తమ సమస్యలను కమిషనర్‌కు చెప్పుకున్నారు. రెండు సార్లు తన సమస్య పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించానని అయినా ఇంతవరకు ఎవరూ స్పందించలేదని గాజువాక జోన్ జోగవానిపాలెం గ్రామానికి చెందిన జైప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశాడు. మల్కాపురం క్రాంతినగర్‌కు చెందిన డి.వెంకటేశ్వరరావు కూడా తన సమస్య పరిష్కారం కాలేదన్నాడు. వీటిపై కమిషనర్ సాయికాంత్ వర్మ దృష్టి సారించారు. తక్షణం సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జోన్–5 పరిధిలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని ఎస్.రంగనాథస్వామి, జోన్–6 పరిధిలో గల ఫ్లైఓవర్స్, బ్రిడ్జ్/కల్వర్ట్స్ మరమ్మతు లు చేపట్టాలని కాపుజగ్గరాజుపేటకు చెందిన ఎం. అప్పలరాజు, జోన్–2 పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని సీహెచ్ వేంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, సీసీపీ సునీత, సీఎంఓహెచ్ డాక్టర్ నరేష్‌కుమార్, డీసీపీ నరేంద్రరెడ్డి, కార్యదర్శి పి. నల్లనయ్య, డీడీ(హార్టికల్చర్) దామోదరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 55 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న సీపీ రవిశంకర్

దొండపర్తి: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీసు సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 55 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, లీగల్ అడ్వైజర్ పి.వి.రామకృష్ణతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

108 అడుగుల గణనాథుడి నిమజ్జనం

సీతమ్మధార : వై.ఎస్.జగన్ యువసేన ఆధ్వర్యంలో దొండపర్తిలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన 108 అడుగు భారీ గణనాథుడి విగ్రహ నిమజ్జనం నేత్ర పర్వంగా జరిగింది. విశాఖ శారదా పీఠాధిపతి స్వామి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చారు. అనంతరం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. వెస్ట్ బెంగాల్ నుంచి తీసుకొచ్చిన మట్టితో వెస్ట్‌బెంగాల్, ఖరక్‌పూర్‌కు చెందిన శక్తిపాల్ బృందంతో ఈ భారీ విగ్రహం రూపొందించింది. వైఎస్సార్ సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఈ విగ్రహం రూపొందింది. 21 రోజుల పాటు ఘనాథుడికి పూజలనంతరం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.



గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

ఏయూలో ప్రవేశాల సందడి



ఆర్ట్స్ కళాశాలలో సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సుల్లో ప్రవేశాల సందడి ఆరంభమైంది. సోమవారం ఏయూ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాళ్ల కార్యాలయాలకు విద్యార్థులు చేరుకొని తమ అలాట్‌మెంట్ లెటర్లను అందజేశారు. సంబంధిత కళాశాలల పరిధిలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రవేశ ప్రక్రియను పూర్తిచేశారు. ప్రవేశం పొందిన విద్యార్థుల సీట్ అలాట్‌మెంట్ లెటర్‌తో పాటు, అవసరమైన ఇతర సర్టిఫికెట్లను కళాశాల సిబ్బంది స్వీకరించారు. మంగళవారం కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. తొలి దశలో ప్రవేశాలు సాధించిన విద్యార్థులంతా వర్సిటీకి చేరుకుని తమ ప్రవేశాల ప్రక్రియను పూర్తిచేస్తున్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



మాట్లాడుతున్న శ్రీరామమూర్తి

ఎంవీపీకాలనీ: ఉత్తరాంధ్ర అభివృద్ధికి వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ అధికార ప్రతినిధి శ్రీరామమూర్తి కోరారు. సోమవారం లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రను దశాబ్దాలుగా ఆయా పార్టీలు నిర్లక్ష్యం చేశాయన్నారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ విధానాలు కారణంగా ఉత్తరాంధ్ర అభివృద్ధికి దూరమైందన్నారు. 1942లోనే పోలవరానికి ప్రతిపాదనలు జరగ్గా నేటికి ఆ ప్రాజెక్టు పూర్తికాలేదన్నారు. పోలవరం ప్రాజెక్టును రాష్ట్రమే కడతాననడంలో మర్మమేంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర అధ్యక్షుడు రవీంద్ర పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో పేదలకు భరోసా

జిల్లా కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

బీచ్‌రోడ్డు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా 28వ వార్డు పరిధిలో భానోజీనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య వైద్యశాల వద్ద సోమవారం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కలెక్టర్ మల్లికార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశంతోనే ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్ష నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశలు, గృహ సారథులు, వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని, వైద్యపరీక్షల కోసం టోకెన్లు జారీ చేస్తున్నారన్నారు. వారంతా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో స్పెషలిస్ట్ వైద్యుల సమక్షంలో సేవలు పొందుతున్నారని చెప్పారు. విశాఖలో 200లకు పైగా క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావును ఆదేశించారు. శిబిరంలో రోగులకు నిర్వహిస్తున్న పరీక్ష గదులను తనిఖీ చేస్తూ సంబంధిత మెడికల్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పి.శివప్రసాద్, కార్పొరేటర్ అప్పలకొండ, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడికి యావజ్జీవ శిక్ష

విశాఖ లీగల్ : స్వల్ప వివాదంలో ఓ వ్యక్తిని హత్య చేసిన నిందితుడికి యావజ్జీవ జైలు, రూ.1500 జరిమానా విధిస్తూ నగరంలోని నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం. శ్రీహరి సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బర్కత్ ఆలీ అందించిన వివరాలు ఎలా ఉన్నాయి. నిందితుడు బోడ రామునాయుడు విశాఖ జిల్లా ఆనందపురం నివాసి. 2012 జూన్‌లో మీసాల సూర్యనారాయణ, మీసాల అప్పలనాయుడు కలిసి రామునాయుడు ఇంటి ముందు నుంచి వెళుతున్నారు. ఇది చూసిన రామునాయుడు మా ఇంటి ముందు నుంచి ఎందుకు వెళుతున్నారని ప్రశ్నించాడు. అందరూ నడిచే దారి ఇదే కదా అని సమాధానం ఇవ్వడంతో వారితో రామునాయుడు గొడవ పడ్డాడు. మీసాల అప్పలనాయుడుకు తల వెనుక భాగంలో గొడ్డలితో బలంగా గాయపరిచాడు. అలాగే సూర్యనారాయణ కూడా గాయపడ్డాడు. వీరిని స్థానికులు 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే నాయుడు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. సూర్యనారాయణ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అప్పలనాయుడు బంధువుల ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు రామునాయుడుపై సెక్షన్ 302 కింద కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ



పోలీస్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

పెదగంట్యాడ: ఫిర్యాదుదారుల పట్ల స్నేహభావంతో మెలగాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ సూచించారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను పారదర్శకంగా విచారణ చేసి త్వరగా వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. సిబ్బంది విధ్యుక్తతలు తెలుసుకున్నారు. వారి పనితీరుపై ఆరా తీశారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు పాడవకుండా చర్యలు చేపట్టాలన్నారు. రౌడీషీటర్స్, సస్పెక్ట్ షీటర్స్ కదలికలపై నిఘా వేయాలన్నారు. ముందుగా ఆయన గంగవరం పోర్టును సందర్శించారు. ఆయనతో పాటు డీసీపీ ఆనంద్‌రెడ్డి ఉన్నారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం : ఆయా స్టేషన్లకు చేరుకోవాల్సిన రైళ్లు ఆలస్యంగా చేరుకుంటున్నందున ఆయా స్టేషన్ల నుంచి సోమవారం బయల్దేరాల్సినవి ఆలస్యంగా ప్రారంభమవుతాయని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ➠ చెన్నైలో సోమవారం రాత్రి 7 గంటలకు బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్–హౌరా (12840) ఎక్స్‌ప్రెస్ సుమారు రెండున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 9.30 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయల్దేరింది. ➠ తిరుపతిలో సోమవారం రాత్రి 7.55 గంటలకు బయల్దేరాల్సిన తిరుపతి–సంత్రగచ్చి (22856) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు నాలుగున్నర గంటలు ఆలస్యంగా మధ్య రాత్రి 12.30 గంటలకు బయల్దేరింది. ఈ రైళ్లు అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు చేరుకోనున్నాయి.

రాష్ట్ర స్థాయి పోటీలకు మురళీనగర్ క్రీడాకారులు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన రోల్‌బాల్ క్రీడాకారులు

మురళీనగర్: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వైశాఖి స్పోర్ట్స్ పార్కులో నిర్వహించిన రోల్ బాల్ రాష్ట్ర స్థాయి క్రీడా జట్టు ఎంపిక ప్రక్రియ సోమవారం ముగిసింది. ఈ మేరకు ఎంపికకు సంబంధించిన పోటీలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సతీష్, కార్యదర్శి నగేష్ సర్యవేక్షణలో నిర్వహించారు. ఈ మేరకు అండర్–14 విభాగంలో బాలికలు, బాలురు, అండర్–17 విభాగంలో బాలురు, అండర్–19 విభాగంలో బాలుర జట్టును రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రోల్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ రెడ్డి , విశాఖ రోల్ బాల్ జిల్లా కార్యదర్శి తోట లలిత ప్రియా, కోచ్ పూసర్ల సంతోష్ కుమార్, వైశాఖి స్పోర్ట్స్ పార్క్ ఉపాధ్యక్షుడు శాంతి భూషణ్, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.